



## 'కోట్‌పల్లి' వద్ద సందడి

ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు దూకుతున్న మత్తడిని తిలకిస్తూ ఎంజాయ్ చేశారు. ప్రాజెక్టులో బోటింగ్ చేస్తూ సెల్ఫీలు, పోటోలు దిగుతూ సరదాగా గడిపారు.

ధారూరు, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి)



## గొడుగుపట్టిన సర్కారు తుమ్మ

కొడంగల్ బస్టాండ్ ఆవరణలో పెరిగిన తుమ్మ చెట్టు గొడుగులా నీడనిస్తోంది. సాధారంగా సర్కారు తుమ్మ చెట్టుకు కొమ్మలు పొడవుగా పెరుగుతాయి. కానీ, ఇక్కడ మాత్రం ఏపుగా పెరిగి గొడుగులా మారి నీడనిస్తోంది. ఎండ నుంచి రక్షణకు, వర్షం వస్తే తడవకుండా ప్రయాణికులు ఈ చెట్టును ఆశ్రయిస్తున్నారు.

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి)





## భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

మహ్మద్ ప్రవక్త జన్మ దినాన్ని పురస్కరించుకొని నిర్వహించే మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఆదివారం మేడ్చల్‌లో ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని పెద్ద మసీదు నుంచి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మత పెద్దలు సయ్యద్ ఇనాయత్ అలీ, ఎండీ.రఫీక్, ఎండీ ఆరీఫ్, సయ్యద్ లాయక్ అలీ, ఎండీ మహబూబ్ అలీ, ఎండీ ఆబేద్ , మునీఆర్ పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి)

## యూరియా ఇయ్యుండ్రి సారూ..

- లైన్లలో రైతులకు తప్పని పడిగాపులు
- సకాలంలో అందక తప్పని తిప్పలు



వికారాబాద్‌లో యూరియా కోసం క్యూలో రైతులు

వికారాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 25 రోజులుగా రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతున్నారు. పంటలకు యూరియా చల్లే సమయం దాటుతుండటంతో రోజూ ఉదయమే సొసైటీ కేంద్రాలు, ఆగ్రోస్ సెంటర్లు, ఫర్టిలైజర్ దుకాణాలు, రైతు వేదికలు, వ్యవసాయ కార్యాలయాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఆదివారం వికారాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో యూరియా కోసం రైతులు బారులు తీరారు. అర్ధరాత్రి వరకు అమ్ముతూ తమ కళ్లముందే బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని మండిపడ్డారు. వ్యాపారులతో కొందరు అధికారులు కుమ్మక్కై యూరియాను బ్లాక్ చేస్తున్నారని, బయట బస్తా రూ.400కు అమ్ముకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తమకు సరిపడా యూరియా ఇవ్వాలని కోరుతున్నారు.

## రుణమాఫీ సాధనే లక్ష్యం




రిలే నిరాహార దీక్షలో రైతులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మండల రైతులకు రుణమాఫీ వర్తింపజేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం ఐదో రోజుకు చేరుకుంది. ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న 1,189 మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు. దీంతో రైతులు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో ఐదు రోజులుగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఘట్‌కేసర్ సహకార సంఘంలో రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులందరికి తక్షణమే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

## కొడంగల్‌లో
# సిమెంట్ పరిశ్రమ!
### ధర్మాపూర్‌లో సున్నపు రాయి నిక్షేపాల వెలికితీత

- ప్రభుత్వ, ప్రైవేట్, అటవీ భూములు 3 వేల ఎకరాల్లో..
- ఫ్యాక్టరీ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు
- సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల హామీ అమలుకు చర్యలు

కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తోంది. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనకబడిన ఈ ప్రాంతానికి ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. కొడంగల్‌లో సిమెంట్ పరిశ్రమ, రైల్వేలైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని రేవంత్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. రైల్వే లైన్ ఏర్పాటుకు ఇప్పటికే సర్వే పూర్తి కాగా మండలంలోని ధర్మాపూర్‌లో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు సున్నపు నిక్షేపాలు వెలికి తీసేందుకు డ్రిల్లింగ్ చేసి ల్యాబ్‌కు పంపించారు. మండల పరిధిలోని ధర్మాపూర్, టేకుల్‌కోడ్, గండ్లెపల్లి, ఇందనూర్ పరిసర ప్రాంతాల్లోని ఫారెస్టు, ప్రైవేట్, ప్రభుత్వ మూడు వేల ఎకరాల్లో సిమెంట్ తయారీకి అవసరపడే నిక్షేపాలున్నట్లు అధికారులు గుర్తించారు.



ధర్మాపూర్ సమీపంలో డ్రిల్లింగ్‌తో నిక్షేపాలు వెలికి తీస్తున్న దృశ్యం(ఫైల్)



కొడంగల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కొడంగల్ ప్రాంత ప్రజలకు సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. వర్షాధార పంటలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న రైతులు తీవ్ర నష్టాలతో ముంబాయి, పూణే, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. వీటన్నింటిని అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మండల పరిధిలోని ధర్మాపూర్, టేకుల్‌కోడ్, గండ్లెపల్లి, ఇందనూర్‌లో అటవీ, ప్రైవేట్, ప్రభుత్వ భూములు మూడు వేల ఎకరాల్లో సిమెంట్ పరిశ్రమకు అవసరమయ్యే నిక్షేపాలను వెలికితీసే పని ప్రారంభించారు. 70కిపైగా బోర్లతో డ్రిల్లింగ్ చేస్తూ సున్నపు నిక్షేపాలు వెలికి తీస్తున్నారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

#### మూడు వేల ఎకరాల్లో నిక్షేపాలు

కొడంగల్ ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో

మిగతా 8వ పేజీలో...

#### విద్య, వైద్యం, ఉపాధే లక్ష్యం



అన్నీ రంగాల్లో వెనకబాటును గురైన కొడంగల్ ప్రాంతంలో విద్య, ఉపాధి, వైద్యం అందించమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తంది. ఇప్పటికే కొడంగల్ ప్రాంత అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరయ్యాయి. ఈ ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

- తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి

## దంచికొట్టిన వాన

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగర శివారులో వర్షం ముంచెత్తింది. భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. వాగులు వంకలు పొంగి పొర్లాయి. ఈసీ మూసీ నదులు ఉప్పొంగాయి. చెక్ డ్యాంలు అలుగు పారాయి. రోడ్లన్నీ చెరువులను తలపించాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటిఅన్నారం వద్ద అత్యధికంగా 128.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గండిపేట మండలం మణికొండలో 71.0 మిల్లీమీటర్లు, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాములలో 55.0 మిల్లీమీటర్లు, సరూర్‌నగర్‌లోని అలకపూరి కమ్యూనిటీ హాల్లో 54.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్‌లో 88.5 మిల్లీమీటర్లు, మల్కాజిగిరిలో 82.5 మిల్లీమీటర్లు, నేరేడ్‌మెట్‌లో 80.0 మిల్లీమీటర్లు, ఆల్వాల్‌లోని వీహెచ్‌సీ సెంటర్ వద్ద 79.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## కల్లులో తోక పురుగులు



వికారాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కల్తీ కల్లు తాగి మృతిచెందిన ఘటనలు ఇటీవల అనేకం చూశాం. కోట్‌పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామంలో కల్లులో తోక పురుగులు రావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కల్లు వ్యాపారి వద్ద నిల్వ ఉన్న కల్లును పారబోశారు. కల్లులో తోక పురుగులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, శుభ్రమైన కల్లు మాత్రమే అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

- తాండూరులో 500 క్వింటాళ్ల మేరకు నిల్వలు
- నియోజకవర్గంలో 149 రేషన్ షాపులు



తాండూరులోని ఓ రేషన్ షాపులో నిల్వ ఉన్న పీడీఎస్ దొడ్డు బియ్యం

తాండూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉగాది కంటే ముందు రేషన్ షాపులకు సరఫరా చేసినవి, గోదాం పాయింట్‌లో నిల్వ ఉన్న పీడీఎస్ దొడ్డు బియ్యం ముక్కపట్టిపోతున్నాయి. ఈ బియ్యాన్ని ఏం చేయాలో ప్రభుత్వం నిర్ణయించకపోవడంతో పురుగుపట్టి గడ్డలు కడుతున్నాయి. పురుగులు, ఎలుకలకు ఆహారంగా మారుతున్నాయి. తాండూరు నియోజకవర్గంలో 149 రేషన్ షాపులు ఉండగా, ఆయా షాపులకు ఏడు నెలల క్రితం సుమారు 300 క్వింటాళ్ల వరకు పీడీఎస్ దొడ్డు బియ్యం సరఫరా చేశారు. తాండూరు సివిల్ సప్లయి గోదాంలో 200 క్వింటాళ్ల వరకు దొడ్డు బియ్యం నిల్వ ఉన్నాయి. ప్రభుత్వం పేదలకు దొడ్డు బియ్యం పంపిణీ నిలిపివేసి ఉగాది నుంచి సన్న బియ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. రేషన్ షాపులకు వచ్చిన దొడ్డు బియ్యం తిరిగి గోదాంకు తరలించకపోవడంతో అవి పాడువుతున్నాయి. గోదాంల వద్ద నిల్వ ఉన్న బియ్యాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పురుగు పట్టకుండా చర్యలు తీసుకుంటున్నారు. సంచుల నుంచి తీసి గాలికి ఆరబోస్తున్నా ఫలితం లేకుండాపోతోంది. నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని క్వింటాల్‌కు రూ.2,400 చొప్పున ధర నిర్ణయించి వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదని తాండూరు సివిల్ సప్లయి గోదాం ఇన్‌చార్జి రవికుమార్ తెలిపారు.

## నారాయణపూర్‌లో తాగునీటి కష్టాలు



తాండూరు రూరల్, సెప్టెంబరు 14, (ఆంధ్రజ్యోతి): భగీరథ నీరు సరఫరా కాక, తాగునీటి బోరు కాగ్నా నదిలో మునిగిపోవడంతో మండలంలోని నారాయణపూర్ గ్రామస్తులు తాగునీటికి తండ్లాడుతున్నారు. బిందెలు పట్టుకుని గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న సింగిల్ ఫేజ్ మోటారు నుంచి, మసీదు నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. తాగు నీటి కోసం అల్లాడుతుంటే పంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ అధికారులు కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు.

## నేడు మెడికల్ విద్యార్థుల మెరిట్ లిస్టు

### 16 నుంచి 18 వరకు ఆప్షన్స్

- 19న సెలెక్టడ్ లిస్టు.. 20 నుంచి అడ్మిషన్లు
- కొడంగల్ మెడికల్ కళాశాలకు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అనుమతి




తాండూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తాండూరులో తాత్కాలికంగా కొనసాగుతున్న కొడంగల్ మెడికల్ కళాశాలకు కళోజీ నారాయణ రావు హెల్త్ యూనివర్సిటీ కూడా అనుమతి ఇచ్చింది. ఇప్పటికే 16 మంది ప్రొఫెసర్లు చేరగా శనివారం ఆరుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు జాయిన్ అయ్యారు. పరికరాలు, ఫర్నిచర్ ఇప్పటికే మెడికల్ కళాశాలకు చేరాయి. నాన్ టీచింగ్ స్టాఫ్‌ను నియమించాల్సి ఉంది. ఆల్‌ఇండియా మెడికల్ కౌన్సిల్ అనుమతితోపాటు స్టేట్ హెల్త్ యూనివర్సిటీ అనుమతులు ఇవ్వడంతో ప్రాసెస్ ప్రారంభమైంది. సోమవారం ఫైనల్ మెరిట్ లిస్టును స్టేట్ హెల్త్ యూనివర్సిటీ ప్రకటించనుంది. ఈ నెల 16 నుంచి 18 వరకు మెడికల్ విద్యార్థులకు ఆప్షన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. 19వ తేదీన సెలెక్టడ్ లిస్టును ప్రకటించిన అనంతరం 20న అడ్మిషన్లు జరగనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు తెలిపారు. కొడంగల్ మెడికల్ కళాశాలకు మొత్తం 50 సీట్లకు గాను 43 సీట్లను రాష్ట్ర కోట కింద మెరిట్ ప్రకారం కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఎంపిక చేయనుంది. ఆల్ ఇండియా మెడికల్ కౌన్సిల్ ఢిల్లీ కమిటీ వివిధ రాష్ట్రాలకు చెందిన ఏడుగురు మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి కొడంగల్ మెడికల్ కళాశాలకు పంపించనున్నారు. ఈ నెల 20న అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయి క్లాసులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

# సీజనల్ భయం

### అప్రమత్తంగా ఉంటే వ్యాధులు దూరం

- జిల్లాలో ఇంటింటికీ జ్వర సర్వే
- వివరాలు సేకరిస్తున్న అధికారులు
- పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్
- దోమల నివారణలకు చర్యలు



మేడ్చల్ సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు ఇంటింటికీ జ్వర సర్వే చేపడుతున్నారు. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. మున్సిపల్, వైద్యశాఖ సమన్వయంతో క్షేతస్థాయిలో కార్యాచరణ చేపడుతున్నారు. కోవిడ్ వేళ జ్వర సర్వే నిర్వహించినట్లుగానే ప్రస్తుతం దోమల బెడదతో వ్యాధుల బారిన పడిన వారి వివరాలను సేకరించాలని సర్కారు నిర్ణయించింది. అన్ని మున్సిపాల్టీలు,

మిగతా 8వ పేజీలో...

#### జాగ్రత్తలు పాటించాలి



సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి జ్వర సర్వే చేపడుతున్నాం. డెంగీ, మలేరియా లక్షణాలు ఉంటే వారికి తక్షణ చికిత్స అందిస్తాం. రక్త ఫలకికలు తగ్గినంత మత్రాన డెంగీగా నిర్ధారించలేం.

- ఉమాగౌరి, డీఎంహెచ్‌వో

## పత్తి రైతు చిత్తే..

- ఆరంభంలో కరువు.. అనంతరం అతివృష్టి
- అధిక వర్షాలకు దెబ్బతిన్న చేలు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడైనా రాదని అన్నదాతల ఆందోళన

7



## పదిహేనేళ్లుగా అసంపూర్తిగా పాఠశాల భవనం

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాఠశాల కోసం ప్రారంభించిన భవన నిర్మాణం పదిహేనేళ్లుగా అసంపూర్తిగా ఉంది. దీంతో ప్రజాధనం వృథా అయిందని గ్రామస్తులు వాపోతున్నారు. నిర్మాణం చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయిందని అంటున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం రాయికల్ పంచాయతీ పరిధి జోగమ్మగూడలో పాఠశాల నిర్మాణానికి 2005లో సాక్షర్ భారత్ నిధులు రూ.75వేలతో స్కూలు భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. బేస్మెంట్, పిల్లర్లు నిర్మించి స్లాబ్ వేశారు. తర్వాత గ్రామంలో బడికి వచ్చే పిల్లల సంఖ్య తక్కువగా ఉందని అక్కడి పాఠశాలను ఎత్తివేశారు. దాంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి దాని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీల విభజన తర్వాత జోగమ్మగూడ గ్రామాన్ని రామేశ్వరం పంచాయతీలో కలిపారు. రామేశ్వరం పంచాయతీ ఏర్పడి ఐదేళ్లు గడిచినా అసంపూర్తి నిర్మాణం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అసంపూర్తి భవనాన్ని పూర్తి చేసి గ్రామ అవసరాల కోసం వినియోగించేలా గ్రామస్తులు కోరుతున్నారు.



ఏళ్లుగా అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

# బూర్గుల సేవలు ఆదర్శం



బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్టేట్ మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు సేవలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రామకృష్ణారావు వర్ధంతిని పురస్కరించుకుని షాద్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. హైదరాబాద్ స్టేట్ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రాభివృద్ధికి కృషిచేశారని కొనియాడారు. ప్రజ్ఞశాలి, స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయ కోవిదుడిగా కీర్తి పొందారన్నారు. బూర్గుల పుట్టిన గడ్డ మీద తాను ఎమ్మెల్యేగా కొనసాగడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొంకళ్ల చెన్నయ్య, సులోచనా కృష్ణారెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరు బస్వం, బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంచాలి

విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచేందుకు క్రీడాకారులు చొరవ చూపాలని సూచించారు. ఆదివారం షాద్‌నగర్ మినీ స్టేడియంలో పట్టణవాసి అంజన్‌గౌడ్ రూ.1.5 లక్షలతో కొని సమకూర్చిన స్పోర్ట్స్ కిట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పిల్లలు మొబైల్ ఫోన్లు, టీవీలకు అలవాటు పడుతూ క్రీడలను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లితండ్రులు కూడా పిల్లలకు విద్యాభ్యాసంతో పాటు, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు కృషిచేయాలని సూచించారు. క్రీడలకు తనవంతు సహాయం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు బస్వం, క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు రవితేజ పాల్గొన్నారు.

# స్వార్థశక్తుల కుట్రలను తిప్పికొట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతి నాయక్

ఆమనగల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి):లంబాడాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఎవరు ప్రయత్నించినా సహించేది లేదని సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లక్పతినాయక్ అన్నారు. సామాజిక న్యాయం, రాజ్యాధికారమే లక్ష్యంగా గిరిజనులంతా ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పేర్కొన్నారు. కడ్తాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్పతి మాట్లాడుతూ.. లంబాడాలను ఎస్టీ జాబితాల నుంచి తొలగించాలని బీజేపీ మాజీ ఎంపీ సోయం బాబూరావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేస్తున్న కుట్రలను లంబాడాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నో పోరాటాల ఫలితంగా దివంగత ప్రధాని ఇందిరాగాంధీ లంబాడాల సామాజిక వెనుకబాటును గుర్తించి వారిని ఎస్టీలో జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. తండాల్లోని ప్రజలు ఆర్థిక వెనుకబాటుతో దుర్భర జీవితాలు ఎల్లదీస్తున్నారని లక్పతినాయక్ అన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తే ఎన్ని పోరాటాలకైన వెనుకాడం అని స్పష్టం చేశారు. ఇప్పుడిప్పుడే లంబాడాలు విద్య, రాజకీయ, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఎస్టీ జాబితాల నుంచి తొలగించేందుకు కుట్ర చేయడం అన్యాయం అన్నారు. నేతలు కుట్రలు వీడకుంటే లంబాడాల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు, రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు కల్పించి ఎస్టీ పంచాయతీలను రెవెన్యూ గ్రామాలుగా గుర్తించాలన్నారు. తండాల్లో పల్లె వైద్య శాలలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జైపాల్‌నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు నరేశ్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, పత్యానాయక్, రాజునాయక్, రతన్‌నాయక్, హరిలాల్‌నాయక్, రమేశ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం



మహిళలకు చెక్కులు అందజేస్తున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయ నిధి వరం అని కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. నేదునూరుకు చెందిన ముగ్గురుకి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఆయన మాజీ వైస్ ఎంపీపీ శమంతతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో అఫ్జల్ బేగ్, పాండురంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి, రాకేశ్‌గౌడ్, బాబు, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## శారీరక దారుఢ్యం, మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



తుక్కుగూడలో స్కేటింగ్ పోటీలను ప్రారంభిస్తున్న కేఎల్లార్

మహేశ్వరం: క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు దోహద పడతాయని కేఎల్ఆర్ అన్నారు. తుక్కుగూడలోని కేఎల్లార్ వెంచర్‌లో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల క్రీడాకారులకు స్కేటింగ్ పోటీలను ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలపైనా దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మైసమ్మను దర్శించుకున్న సినీ నటుడు శ్రవణ్



శ్రవణ్‌ను సన్మానిస్తున్న ఈవో స్నేహలత

కడ్తాల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని సినీ నటుడు శ్రవణ్, టీవీ నటులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. శ్రవణ్‌ను ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలత పూలమాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఉన్నారు.

## చేవెళ్లలో వైద్య శిబిరం విజయవంతం



శిబిరంలో వైద్యం అందిస్తున్న వైద్యులు

చేవెళ్ల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీఎంస్ చైర్మన్ పి.కృష్ణారెడ్డి, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, భగవాన్ సత్యసాయిబాబా సేవా సమితి సభ్యుడు గోపాలచారి అన్నారు. ఆదివారం చేవెళ్ల, పామెన, బస్తేపూర్, రామన్నగూడ, కౌకుంట్ల, తంగడ్‌పల్లి, రావులపల్లి, మల్లారెడ్డిగూడ, ఖానాపూర్ తదితర గ్రామాల్లో ఉచిత మెగావైద్య శిబిరాలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలకు వైద్యం పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. 64 మంది వైద్యులు, 200మంది సిబ్బందితో నిర్వహించిన వైద్య శిబిరానికి భారీ స్పందన వచ్చింది. స్వామివారి ఆశీర్వాదంతోనే వైద్య శిబిరం విజయవంతమైందని అన్నారు. మొత్తం 3,958 మందికి వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. సాధారణ వైద్య పరీక్షలు, కన్ను, డెంటల్, ఈఎన్‌టీ, గుండె, శ్వాస సంబంధ వ్యాధులు, యూరాలజీ, స్త్రీ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు ఉన్నారు.

### చేవెళ్లలో సత్యసాయి సేవా సమతి ర్యాలీ...

చేవెళ్లలో భగవాన్ సత్యసాయిబాబా సేవా సమితి సభ్యులు ప్రధాన వీధుల్లో సత్యసాయి బాబా చిత్రపటాన్ని వాహనంపై పెట్టి ర్యాలీ నిర్వహించారు. సాయిరాం నామ స్మరణతో పట్టణం మార్మోగింది. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాల్లో సేవలందించిన సత్యసాయి భక్తులు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహేందర్‌రెడ్డి

## విమోచనోత్సవాన్ని విజయవంతం చేయాలి

కొత్తూర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఈ నెల 17న విజయవంతం చేసేందుకు ప్రతీ కార్యకర్త నడుం బిగించాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రణధీర్‌గౌడ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన సేవా పక్వాడ్ కార్యక్రమానికి మహేందర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. హైదరాబాద్ విమోచన, తెలంగాణ స్వాతంత్యానికి ప్రాణత్యాగం చేసిన అమరుల చరిత్ర ప్రతీ తరానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంటరీ పార్టీ కోకన్వీనర్ అమడపురం నర్సింహాగౌడ్, సేవా పక్వాడ్ జిల్లా కోకన్వీనర్ ప్రశాంత్, నాయకులు ఎర్రవెల్లి నాగరాజచారి, మల్లేష్, ప్రదీప్, శేఖర్,గణేష్, విజయభాస్కర్‌రెడ్డి, ప్రభాకర్, సురేందర్, అరవింద్, శ్రీశైలం, మహేందర్, సురేష్, సందీప్‌సింగ్ పాల్గొన్నారు.

## అంబేడ్కర్ స్ఫూర్తిగా ముందుకు సాగాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రబుద్ధ భారత్ ప్రతినిధులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో రాణించేందుకు శ్రమించాలని ప్రబుద్ధ భారత్ సంస్థ ప్రతినిధి మీసాల అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు కార్యక్రమంలో భాగంగా బెస్త సంఘం నాయకుడు నర్సింహతో కలిసి ఎదులాబాద్ రోడ్డులోని విగ్రహానికి పూలమాలలు వేశారు. వారు మాట్లాడుతూ యువత సమయాన్ని వృథా చేయకుండా విద్యలో రాణించాలని అన్నారు. నాడు అంబేడ్కర్ శ్రమించి ఉన్నత విద్య అభ్యసించడంవల్లే అవకాశాలను పొందగలిగాడన్నారు. కార్యక్రమంలో దాసు, నర్సింగరావు, అంజనేయులు, అశోక్, రవి, రాజేష్, భరత్, గణేష్ పాల్గొన్నారు.

## వన్య ప్రాణుల రక్షణలో అధికారులు విఫలం



అడవి పందులను చంపి కాల్చిన వేటగాళ్లు (ఫైల్)

మర్పల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వన్య ప్రాణులతోనే ముడిపడి మనుషుల మనుగడ ఉంటుందని పదే పదే చెబుతున్నా వన్య ప్రాణుల రక్షణలో సంబంధిత అధికారులు విఫలం అవుతున్నారు. అటవీ ప్రాంతాల్లోని జంతువులను కొందరు వేటాడి చంపి మాంసం రూపంలోకి మార్చి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా అడవుల్లో సంచరిస్తూ వన్య ప్రాణులను వేటాడి వాటి ప్రాణాలను హరిస్తున్నారు. మర్పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో కొంత కాలంగా అడవి పందుల వేట జోరుగా కొనసాగుతోంది. అడవి పందులను వేటాడి వాటిని కాల్చి మాంసం విక్రయిస్తున్నారు. రైతుల పంటలను అటవీ పందులు నాశనం చేస్తున్నా రైతులు వాటికి ఎలాంటి హాని చేయకుండా పంటను కాపాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వన్యప్రాణుల రక్షణ కోసం తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి



పరిగిలో మొబైల్ షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి):యువత స్వయం ఉపాధి వైపు దృష్టి సారించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగిలోని ఎంసీసీ కాంప్లెక్స్‌లో స్వయం ఉపాధి కింద అస్లామ్ ఏర్పాటు చేసుకున్న మొబైల్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం యువత ఉపాధి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. ఉద్యోగాల కంటే వ్యాపార రంగంలో ఎక్కువగా సంపాదించొచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ కార్యదర్శి కె.హనుమంత్, అక్బర్ సేట్, ఉస్మాన్ అలీ, అస్లామ్ పాల్గొన్నారు.

# పత్తి రైతు చిత్తే



రాపోల్‌లో దెబ్బతిన్న పత్తి చేను

- ఆరంభంలో కరువు.. అనంతరం అతివృష్టి
- అధిక వర్షాలకు దెబ్బతిన్న చేలు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- పెట్టుబడైనా రాదని అన్నదాతల ఆందోళన



కొట్టుకుపోయిన పత్తి మొక్కలు



పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో దెబ్బతిన్న చేను వద్ద ఆవేదనలో రైతులు

పరిగి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ వానకాలంలో కురిసిన అధిక వర్షం పత్తి రైతును చిత్తు చేస్తోంది. ఆరంభంలో వర్షాభావం, కొన్ని రోజుల కిందటి వరకు కురిసిన అధిక వర్షాలతో రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఎదిగిన పత్తి చేలు అతివృష్టితో చాలా మేర దెబ్బతిన్నాయి. పత్తి కాయలు రాలిపోయాయి. మొక్కలు నీట మునిగి కుళ్లిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో తెలియని స్థితిలో రైతులు దిక్కులు చూస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి పత్తిసాగు తగ్గించారు. గతేడాది 2,53,063 ఎకరాల్లో పత్తి సాగుచేయగా, ఈ సారి 2,50,134 ఎకరాల్లో వేశారు. రైతుల ఆశలపై అధిక వర్షం నీళ్లు చల్లింది. మొదట్లో వర్షాలు రాక ఆలస్యంగా విత్తారు. ఇప్పుడేమో అధిక వర్షాలతో నష్టం కలిగింది. దిగుబడి సగం కూడా రాని పరిస్థితులేర్పడ్డాయి. జిల్లాలో 50వేల ఎకరాలకుపైగా పత్తి పంటకు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా. అధికారుల మాత్రం రెండు వేల ఎకరాల్లోపే నష్టం జరిగిందని చెబుతున్నారు. అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 12క్వింటాళ్ల నుంచి 20క్వింటాళ్ల దిగుబడొచ్చేది. పంటలు మునిగిన నేపథ్యంలో ఎకరానికి రెండు,మూడు క్వింటాళ్లే రానుంది. ఎకరానికి రూ.35వేల పెట్టుబడి అవుతుంది. ఇంత తక్కువ దిగుబడితో పెట్టుబడైనా రాదని రైతులు వాపోతున్నారు.

### అధిక వర్షాలకు తోడు తెగుళ్లు

అధిక వర్షాలకు తోడు భూముల్లో పోషకాల లోపంతో పత్తి మొక్కలు ఎర్రబారి ఆకులు, కాయలు రాలుతున్నాయి. ఎర్ర భూముల్లో ఈ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. నల్లభూముల్లో కాస్త ఆలస్యంగా బయట పడుతుంది. వేల ఎకరాల పంటకు తెగులు సోకింది. మొక్క చనిపోతుండడంతో ఏం చేయలేని స్థితిలో రైతులున్నారు.

### మొలకెత్తక మళ్లీ మళ్లీ నాటి

మొదట్లో చిన్నపాటి వర్షాలకు నాటిన విత్తనాలు మొలకెత్తలేదు. ఆ తర్వాత కురిసిన వర్షాలకు రెండోసారి విత్తుకున్నారు. ఆగస్టు నెలలో ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో చేలల్లో నీరు చేరి మొక్కలు కుళ్లిపోయాయి. వాన దెబ్బతోపాటు, బెల్లం తెగులు సోకి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

### పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు



ఐదు ఎకరాల్లో పత్తి వేశాను. రూ.2లక్షల వరకు పెట్టుబడి అయింది. ప్రారంభంలో వర్షాలు కురియక ఆలస్యంగా విత్తాం. తర్వాత అధిక వర్షానికి పంట నీరేసి మొక్కలు మురిగిపోయాయి. పత్తి కాయ దశలోనే నీరుపట్టి పోయింది. బాగున్న మొక్కల కాయలు అధిక వర్షాలకు రాలిపోయాయి. మొక్కకు 20నుంచి 25కాయలు కూడా లేవు. యూరియా కొరతా ఇబ్బంది పెట్టింది. ఎకరానికి 2 క్వింటాళ్లయినా వచ్చే పరిస్థితి లేదు.

**- నారాయణ, పత్తి రైతు, రాఘవాపూర్**

### పత్తి పంట నష్టం వాస్తవమే



అధిక వర్షాలతో పంటలు దెబ్బతింటున్నది వాస్తవమే. ప్రధానంగా పత్తి పంటకు నీరు ఎక్కువై నీరుపట్టి మొక్కలు చనిపోయాయి. భారీ వర్షానికి నీరు నిలిచి, మట్టికప్పేసి నష్టం జరుగుతున్నది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి పత్తి పంట నష్టాన్ని వివరాలు సేకరిస్తున్నారు.

**- రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్**



నూతన కార్యవర్గంతో మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని శంకర్‌పల్లి మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి అన్నారు. కొండకల్ గ్రామ యువజన విభాగం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. పార్టీకి కార్యకర్తలే ఆయువుపట్టని గుర్తుచేశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి సాధించాయని, ప్రస్తుతం కుంటుపడిందని అభిప్రాయపడ్డారు. బీఆర్‌ఎస్ గ్రామ యూత్ అధ్యక్షుడిగా రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, ఉపాధ్యక్షుడిగా రాములు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బద్దం సురేందర్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి. గ్రామ పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు నవీన్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## రెడ్డి సేవా సమితి నూతన కమిటీ



రెడ్డి సేవా సమితి నూతన కమిటీ సభ్యులు

కేశంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల రెడ్డి సేవా సమితి నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా తలసాని మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా తలసాని రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా తలసాని ప్రవీణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, సభ్యులుగా పురుషోత్తంరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రమణరెడ్డి, హరికృష్ణారెడ్డి, తలసాని కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు యెన్నం శ్రీధర్ రెడ్డి, తలసాని వెంకట్ రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన



మాట్లాడుతున్న సీఐ బాలస్వామి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌కు ఘట్‌కేసర్, పోచారం ఐటీ కారిడార్ పోలీసు స్టేషన్‌ల్లో అనూహ్య స్పందన లభించింది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 13న లోక్ అదాలత్‌లో ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్‌లోని 102 కేసులు, 330పెట్టి కేసుల్లో వాదులు, ప్రతివాదులు రాజీ పడ్డారని తెలిపారు. చిన్న చిన్న గొడవలు, కుటుంబ సంబంధ తగాదాలు, అప్పులు, సంపద విభజన వంటి విషయాల్లో కోర్టులకు పోకుండా లోక్ అదాలత్ వేదికగా నిలిచిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు. పోచారం ఐటీ కారిడార్ స్టేషన్ పరిధిలో 70సాధరణ కేసులు, 645 పెట్టి కేసుల్లో రాజీపడ్డారని సీఐ రాజువర్మ తెలిపారు.

## దాతలు ముందుకు రావాలి



మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) ఆర్టీసీ తన ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో దాతల సాయంతో 'పేదల కోసం యాత్ర దానం' కార్యక్రమాన్ని ప్రారంభించిందని మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తీర్థయాత్రలకు వెళ్లే స్థోమత లేని పేద వృద్ధులు, దివ్యాంగులు, కళాశాలలకు వెళ్లే విద్యార్థు లకోసం దాతలసాయం కోరుతూ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో వీరికి ప్రయాణించే వీలు కల్పించటానికి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని కోరారు. ఆసక్తిగల వారు 9959226151, 9849737131 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# మందుల పిచికారిలో జాగ్రత్తలు తప్పనిసరి

- అధిక మోతాదులో రసాయనాలు వాడొద్దు
- వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



మేడిపల్లిలో పంటకు రసాయన మందు పిచికారి చేస్తున్న రైతు

యాచారం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పంటలకు సోకుతున్న చీడపీడల నివారణకు మోతాదుకు మించి క్రిమిసంహారక మందులు వాడొద్దని రైతులకు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది పత్తి 1,38,478 ఎకరాలు, మొక్కజొన్న 68,364 ఎకరాలు, వరి 1,17,022 ఎకరాలు, జొన్న 5,762 ఎకరాలు, కంది 14,914 ఎకరాల్లో సాగు చేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు. పంటలపై చీడపీడల నివారణకు రసాయన మందులు అధికంగా వాడుతున్నారు. తెగుళ్ల నివారణకు అడ్డగోలుగా మందులు పిచికారి చేస్తూ నష్టపోతున్నారు. రసాయన మందులు ఎక్కువ వాడితే పంటల దిగుబడి పెరగకపోగా పెట్టుబడి ఖర్చులు పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

### అవగాహన లేక అధిక మోతాదు వాడకం

పంటలపై చీడపీడల నివారణకు మందుల వాడకంపై ఎక్కువ మంది రైతులకు అవగాహన ఉండటం లేదు. అవసరం ఉన్నదాని కన్నా ఎక్కువ మోతాదులో మందులు వాడి నష్టపోతున్నారు. రైతులకు దుకణాదారులు వివిధ రసాయన మందులు అంటగట్టి పంపుతున్నారనే విమర్శలున్నాయి.

### మెలకువలు పాటించాలి

పంటలపై చీడపీడల నివారణకు మందులు వాడే సమయంలో రైతులు మెలకువలు తప్పక పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. మందుల పిచికారి సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. చేతులకు ప్లాస్టిక్ గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించాలి. తలపై ప్లాస్టిక్ కవరు(టోపి) పెట్టుకోవాలి. ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి. మోచేతి వరకు ప్లాస్టిక్ కవరు కట్టుకోవాలి. మందుల పిచికారి అనంతరం పూర్తి శరీరాన్ని సబ్బుతో కడుక్కోవాలి. కళ్లలో మందు పడకుండా కూలింగ్ గ్లాసులు ధరించాలని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, వైద్యులు సూచిస్తున్నారు.

### సేంద్రియంతో అధిక దిగుబడి



పంటలపై చీడపీడల నివారణకు రసాయన మందులను తక్కువ మోతాదులో పిచికారి చేసుకోవాలి. అధికారుల సూచనల మేరకే మందులువాడాలి. సేంద్రియ మందుల వాడకంతో పంట దిగుబడి పెరిగి, నేల సారవంతాన్ని కాపాడుకోవచ్చు. అలాగే పంట ఉత్పత్తి నాణ్యతగా ఉంటుంది. భూసార పరీక్షల ఆదారంగానే మందులు వాడాలి. ప్రకృతి వ్యవసాయ విధానంతోనే పర్యావరణానికి మేలు.

**- బి.ఉష, జిల్లా వ్యవసాయాధికారి**

## బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి



గుమ్మడవెల్లిలో మాట్లాడుతున్న నాయకుడు జయేందర్

కందుకూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్, మహేశ్వరం ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని గుమ్మడవెల్లి, మాదాపురం, కొలన్‌గూడ గ్రామాల్లో ఆ పార్టీ గ్రామస్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు గుర్తుచేశారు. అధికారం చేపట్టి రెండేళ్లు గడిచినా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. సమావేశాల్లో కొనల్‌గూడ మాజీ సర్పంచ్ గీతేశ్వరి గణేష్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, శేఖర్‌గుప్తా, మస్కు బాబు, జంగయ్య, దేవిలాల్‌నాయక్, తాళ్ల కార్తీక్, బి.దీక్షిత్‌రెడ్డి, భద్రయ్య, టి.ఇందిర, టి.దేవేందర్, కుమార్, మహేందర్, భాస్కర్, యాదగిరి, గణేష్, బీరప్ప, వేణు, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం అవసరమైతే ఆమరణ నిరహార దీక్ష ప్రారంభిస్తామని గట్టిప్పలపల్లి జేఏసీ నాయకులు ప్రకటించారు. తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారం 312వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, యువకులు, వివిధ పార్టీల నాయకులు, మెదక్‌పల్లి, వెంకట్రావ్‌పేట, బొమ్మరాశిపల్లి గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని మాజీ సర్పంచ్ జయమ్మ వెంకటయ్య, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, ఆంజనేయులుగౌడ్, కార్యదర్శి అనిల్‌లు కోరారు. రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటుచేసే 11 మండలాల జాబితాలో గట్టిప్పలపల్లిని చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పాలక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలన్నారు.

## ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- కడ్తాల్ తహసీల్దార్ ముంతాజ్

కడ్తాల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమించినా, అక్రమంగా విక్రయించినా కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ముంతాజ్ హెచ్చరించారు. భూముల కొనుగోలు చేసేవారు ఆయా సర్వే నెంబర్‌లలోని భూముల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. కడ్తాల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ కడ్తాల్ మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూములను పట్టా భూములుగా చూపించి అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పక్కపక్కనే ఉన్న సర్వేనెంబర్‌లలో ప్రభుత్వ, ప్రైవేట్ భూములుంటే.. ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా చూపించి మాయమాటలతో కొనుగోలుదారులను మోసం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఇప్పటికే ప్రభుత్వ భూములను నిషేధిత జాబితాలో ఉంచడం జరిగిందన్నారు. కొనుగోలుదారులు భూములు కొనుగోలు చేసే సమయంలో పూర్తి విచారణతో కొనుగోలు చేయాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూములు ఆక్రమించినా, అమ్మినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

## ప్రభుత్వం స్పందించే వరకు పోరాడుతాం

- ఆరో రోజు రిలే దీక్షలో పాల్గొన్న మహిళా రైతులు



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న నిర్వాసిత రైతులు

కడ్తాల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ భూనిర్వాసితులు అన్నారు. విద్యుత్ లైన్ అలైన్మెంట్ మార్చు వరకు ఊరుకునేది లేదన్నారు. కడ్తాల సమీపంలోని పంటపొలాల మీదుగా ఏర్పాటు చేయదల్చిన 765 కేవీ లైన్‌ను మార్చాలనికోరుతూ రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష ఆదివారం ఆరో రోజుకు చేరింది. దీక్షలో నిర్వాసితులు మహిళా రైతులు గంట రాధిక, స్వాతి, నర్సింహ, శివరామ్ రెడ్డి, జి.కృష్ణ, రాములు కూర్చున్నారు. రైతులకు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. బీదర్ పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ కర్ణాటకలోని బళ్లారి నుంచి మీర్ఖాన్‌పేట వరకు వేస్తున్న హైటెన్షన్ లైన్‌కు భూములు తీసుకుంటే తాము ఉపాధి కోల్పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నెలలుగా ఆందోళన చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం ఆగ్రహం వ్యక్తం చేశారు. లైన్‌ను మార్చే వరకు దీక్షలను కొనసాగిస్తామని తేల్చి చెప్పారు. దీక్షలో నాయకులు కడారి రామకృష్ణ, పెంటారెడ్డి, పర్వతకుమార్‌యాదవ్, పి.వెంకటేశ్, రాములయ్య, వెంకట్రాములుగౌడ్, కాలె వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## బస్టాండ్‌ను కూల్చిన గుర్తుతెలియని వ్యక్తులు



ప్రధాన రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న నాయకులు తండా వాసులు

కోట్‌పల్లి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వ్యక్తులు బస్టాండ్ కూల్చివేసిన ఘటన బార్వాద్ తండాలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డుపై ఉన్న బస్టాండ్‌ను జేసీబీతో కూల్చివేశారనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తండా వాసులకు నిలువనీడ లేకుండాపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం నాయకకులతో కలిసి రోడ్డుపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ శైలజ అక్కడికి చేరుకుని మాట్లాడారు. నిందితులను పట్టుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బస్టాండ్ కింద ఎవరైనా ఉన్నారేమోనని పోలీసులు జేసీబీతో శిథిలాలను తొలగించి చూశారు. ధర్నాలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సుందర అనిల్, మాజీ సర్పంచ్ వెంకటేష్‌యాదవ్, బీజేపీ నాయకుడు కృష్ణయాదవ్, నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రసాద్‌కుమార్ తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాలి



బతుకమ్మ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వికారాబాద్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కళల ద్వారా భారతీయ సంస్కృతి, సంప్రదాయలను పరిరక్షించాలని సంస్కార భారి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని సిద్ధార్థ పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సంస్కార భారతి జాతీయ స్థాయిలో పనిచేస్తుందని, అంతరిస్తున్న కళలను కాపాడుకోవాలని, భవిష్యత్తు తరాలకు సంస్కార భారతి వేదికగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రానున్న దేవీ నవరాత్రుల సందర్భంగా బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించాలన్నారు. అనంతరం సంస్కార భారతి బతుకమ్మ సంబురాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక సేవా మండలి అధ్యక్షులు టి.రాజు, సంస్కార భారతి కార్యదర్శి టి.ప్రభాకర్, ఉపాధ్యక్షులు భూపాల్, ఆనంద్, విశ్వనాథం, రాఘవేందర్ గుప్తా, సంజీవ్, ప్రదీప్, మ్యాడం దత్తు, ఆర్.శ్రీనివాస్, నవీన్, మంజుల, మమత తదితరులు పాల్గొన్నారు.




# గ్రామాల్లో నయా ట్రెండ్!

### జోరుగా వీధి వ్యాపారం

- చెంతకే సరుకులు.. గుమ్మం ముందే సంత
- వాహనాలపై తిరుగుతూ వస్తు అమ్మకాలు

మంచాల, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నయా ట్రెండ్ నెలకొంది. ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వీధి వ్యాపారం జోరందుకుంది. తెలతెలవారుతుండగానే వాహనాలకు మైకులు పెట్టుకొని గ్రామాలాట్ల తిరుగుతూ చిరు వ్యాపారులు సందడి చేస్తున్నారు. మైకుల చప్పుడు రాగానే ఇళ్లలోని మహిళలు బయటకొచ్చి అవసరం ఉన్న సరుకులు కొంటున్నారు. గుమ్మం ముందుకు వచ్చిన సంతతో వ్యవప్రయాసలు లేకుండా సరుకులు సమకూర్చుకుంటున్నారు. ఇళ్ల ముందుకొచ్చిన వస్తువులతో వారికి బేరమాడే శక్తి కూడా పెరుగుతోంది. వీధి వ్యాపారులు మిరపకాయలు మొదలుకొని పండ్లు, సగటు గ్రామీణ కుటుంబానికి కావాల్సిన నిత్యావసర సరుకులు ఇలా అన్నింటినీ ఇళ్ల వద్దకొచ్చి అమ్ముతున్నారు. ఇళ్లలో ఫర్నిచర్, దుప్పట్లు, చీరలు తదితర వస్త్రాలు గుమ్మం ముంగిటికే వచ్చేస్తున్నాయి. ఇలా సరుకుల కొనుగోళ్లతో మహిళలకు వ్యయం, సమయం కలిసొస్తున్నాయి. అలాగే గ్యాస్‌స్టౌ, గ్రైండర్లు వంటి వస్తువుల రిపేర్లు సైతం మోపెడ్లు, బైక్‌లపై వచ్చి రిపేర్ చేస్తున్నారు.

### పురాతన పద్ధతికి ఊపిరి

అప్పట్లో రోడ్లు, వాహనాలు తదితర వసులు లేక వ్యవసాయమే జీవనాధారం గల గ్రామీణులు తమ నిత్యావసర సరులకు వీధివ్యాపారులనే ఆశ్రయించేవారు. కావాల్సిన సరుకులను సమీప అంగళ్లలో సమకూర్చుకునేవారు. ఇప్పుడు ఈ నయా ట్రెండ్‌తో కనుమరుగైన దాసరి గంపల పద్ధతి గ్రామాల్లో మళ్లీ కన్పిస్తోంది. అదెలా అంటే పురాతన కాలం నుంచి ఇటీవలి నగరీకరణ దాకా రకరకాల కులవృత్తుల వారు గ్రామాల్లో తమ ఉత్పత్తులను అమ్ముకుని జీవనం సాగించేవారు. పూసల కుల వృత్తుల వారు వంటగిన్నెలు, పిన్నీసులు, టాల్కం పౌడర్ వంటి సౌందర్య వస్తువులను గ్రామాల్లో తిరిగి అమ్మేవారు. అలాగే కంసాలి, నేతన్నలు, మిర్చి వ్యాపారులు డప్పుచాటింపు వేయించి చౌరస్తాలో అమ్మకాలు జరిపి వెళ్లేవారు. ఇప్పుడు ఆధునిక టెక్నాలజీ కాలంలోనూ పురతాన పద్ధతే నయాట్రెండ్‌గా మారుతోందని చెప్పొచ్చు. అప్పట్లో నడుచుకూంటూ వీధివ్యాపారం చేసే వారు ఇప్పుడు వాహనాలపై సంచరిస్తూ వస్తు అమ్మకాలు కొనసాగిస్తున్నారు.



వాహనాలపై తిరుగుతూ వస్తువులను అమ్ముతున్న చిరు వ్యాపారులు

## కేజీబీవీలో ఘనంగా హిందీ దివస్



కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థినులు

ధారూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ధారూరు కేజీబీవీలో ఆదివారం హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్ల తాండూర్ కళావేదిక ఫైండర్, అధ్యక్షుడు కేవీఎం వెంకట్, హరివిల్లు ఫౌండేషన్ అధ్యక్షుడు మురారినాథ్‌ల ఆధ్వర్యంలో హిందీ దివస్ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. హిందీ బాషను బాల్యం నుంచే నేర్చుకోవాలని సూచించారు. హిందీ భాష భారతదేశ ఐక్యతకు ప్రతీక అని అన్నారు. మన సంస్కృతి, సాహిత్య సంపదకు అద్దం పట్టే సాధనం హిందీ భాషని వారు వివరించారు. హిందీ కవితా పఠనంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో స్రవంతి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పరిగి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో 1992-93లో టెన్త్ చదివిన పరిగి ప్రాంతానికి చెందిన విద్యార్థులు 33ఏళ్ల తర్వాత ఒకేచోట కలిశారు. పరిగిలోని ఓ ఫామ్‌హౌజ్‌లో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఇక నుంచి ప్రతి ఏటా జరుపుకోవాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు లక్నాపూర్ శ్రీనివాస్, శశిధర్, ఆనంద్‌గౌడ్, రాజిరెడ్డి, సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



కియా కార్ షోరూం పరిశ్రమ వద్ద విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలకు అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కియా మోటార్స్ సంస్థ సర్వీసింగ్ మేనేజర్ కాంత్రి తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ట్రిపుల్‌ఈ విభాగం ఆధ్వర్యంలో పరిశ్రమల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే మనం అన్ని రంగాల్లో విజయం సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీజనల్ భయం

(ఐదో పేజీ తరువాయి)

కార్పొరేషన్ల పరిధిలోని అన్ని వార్డుల్లో సర్వే చేస్తున్నారు.

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో 12 మున్సిపాల్టీలు, మూడు కార్పొరేషన్ల పరిధిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. డెంగీకి కారణమైన దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. నీటినిల్వ ఉన్న ప్రాంతాల్లో సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు. పూలకుండీలు, తొట్టీలు, కొబ్బరిచిప్పలు, పాత టైర్లు వంటి వాటిలో దోమల లార్వా వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. వీటిలో లార్వాను చంపేందుకు మున్సిపాల్టీ సిబ్బంది ఆయిల్ బాల్స్‌ను వదలుతున్నారు.

### ఇంటింటికీ వెళ్లి వివరాల సేకరణ

జిల్లాలోని వైద్య శాఖ ఆధ్వర్యంలో పట్టణాల్లో ఇంటింటా జ్వర సర్వే చేపడుతున్నారు. డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో కిందిస్థాయి సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ప్రతి ఇంట్లో జ్వరం, ఒంటి నొప్పులు తదితర లక్షణాలతో బాధపడేవారిని గుర్తించనున్నారు. వీరికి అవసరమైన చికిత్స అందించనున్నారు. శరీరంలో రక్త ఫలకికలు తగ్గిన వారికి ప్రత్యేక చికిత్స ఇవ్వనున్నారు.

### ప్రతి శుక్రవారం శుభ్రతకు ప్రాధాన్యం

ప్రతి శుక్రవారం పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. నీటి నిల్వ తొట్టెలను శుభ్రం చేయడం, టైర్లలో నీటిని తొలగించడం, గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా శ్రద్ధ చూపడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. డెంగీ నివారణకు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు.

# ఈ ఏడాదైనా..!

- 'పది' పరీక్షా కేంద్రం ఏర్పాటుపై ఆశలు
- 25కి.మీలు వెళ్లి పరీక్ష రాయాల్సిన దుస్థితి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- దుద్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని డిమాండ్




దుద్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలం ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు మండల కేంద్రంలో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో దుద్యాల, హకీంపేట్, కుదురుమళ్ల, కేజీబీవీ చెట్లుపల్లి తండా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతీ సంవత్సరం ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సంవత్సరం దుద్యాల పాఠశాల నుంచి 68 మంది, హకీంపేట్ నుంచి 64 మంది, కేజీబీవీ నుంచి 51మంది, కుదురుమళ్ల నుంచి 35మంది మొత్తం 218మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. అందులో 142మంది బాలికలు ఉన్నారు. దుద్యాల మండల కేంద్రంలో పరీక్షా కేంద్రం లేకపోవడంతో కుదురుమళ్ల పాఠశాల విద్యార్థులు దౌల్తాబాద్ మండల కేంద్రంలోని పరీక్షాకేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. దుద్యాల, హకీంపేట్, కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని పరీక్షా కేంద్రానికి వెళ్తున్నారు. దీంతో కొన్ని గ్రామాలు, తండాల విద్యార్థులు దాదాపు 25 కిలో మీటర్లు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, తల్లి దండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రయాణాల దృష్ట్యా పరీక్షా సమయానికి హాజరు కావడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. దుద్యాల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఎదుట పోలీస్‌స్టేషన్ కూడా ఉంది. దీంతో పోలీసు బందోబస్తుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ఈ ఏడాదైనా మండల కేంద్రంలో పరీక్షా కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### బొంరాస్‌పేట్‌కు బస్సు సౌకర్యం లేదు



మా గ్రామం నుంచి ఉదయం, మధ్యాహ్నం సమయాల్లో బొంరాస్‌పేట్‌కు బస్సు సౌకర్యం లేదు. దీంతో పరీక్షా సమయానికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దుద్యాల మండల కేంద్రంలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- శివకుమార్, పదో తరగతి విద్యార్థి, హకీంపేట్

### 25 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుంది



దాదాపు 20-25 కిలో మీటర్ల దూరంలో ఉన్న పరీక్షా కేంద్రానికి వెళ్లాల్సివస్తోంది. సమయానికి వెళ్లేందుకు తంటాలు పడుతున్నాం. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి దుద్యాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయాలి.

- చందన, అల్లిఖాన్‌పల్లి

# పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేయిస్తున్న మాజీ ఎంపీటీసీ రవి

ధారూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మున్నూర్‌సోమారం గ్రామంలో తాగునీటి సమస్యపై ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన చేయడంతో సమస్యను ఆదివారం పరిష్కరించారు. ఈ సమస్యపై అధికారులు స్పందించకపోవటంతో మాజీ ఎంపీటీసీ రవి ముందుకు వచ్చి పగిలిన పైపులైన్ మరమ్మతు పనులు చేపట్టారు. గ్రామ శివారులోని పొలంలో పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి ట్యాంకులోకి నీటిని ఎక్కించారు. కాగా గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడం, ట్యాంకుకు వెళ్లే పైపు లైన్ పగిలిపోవటంతో తాగునీటి ఇబ్బందితో ఎస్సీ కాలనీ వాసులు ఆందోళన చేసి సోమవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించిన విషయం తెలిసిందే. అయినా తాగునీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శి, మండల అధికారులు స్పందించలేదు. తాగునీటి కోసం ప్రజల ఇబ్బందులను గ్రహించిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ రవి పైపులైన్‌కు మరమ్మతులు చేయించడంతో గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం





లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు అందుకున్న ఉపాధ్యాయులు

కొడంగల్/కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కొడంగల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(సోషల్)గా విధులు నిర్వహిస్తున్న ఏసురత్నం, బొంరాస్‌పేట్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(సోషల్)గా విధులు నిర్వహిస్తున్న బాకారం మల్లయ్య ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మహబూబ్ నగర్‌లో వారిని ఆదివారం డిస్ట్రిక్ లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సన్మానంతో సర్టిఫికెట్లు అందజేశారు.అదేవిధంగా యాలాల మండలం పగిడ్యాల్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న టేకుల్ కోడ్ గ్రామానికి చెందిన తలారి కృష్ణయ్య ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై సన్మానం పొందారు.

**తాండూరు:** తాండూరు లయన్స్ క్లబ్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వెంకట్‌రెడ్డి (నాగులపల్లి), వడిచర్ల సత్యం (కందనెల్లి), శ్రీనివాస్ (తొర్మామిడి), విజయ్‌కుమార్ (జీవన్గి), టి.కృష్ణయ్య (పగిడ్యాల్)ను లయన్స్ క్లబ్ డైరెక్టర్ డా.మహేందర్ కుమార్‌రెడ్డి, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తాండూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శరణ్ బసప్ప, కోశాధికారి గౌరి శంకర్ సన్మానించారు.



సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

# కొడంగల్‌లో సిమెంట్ పరిశ్రమ!

(ఐదో పేజీ తరువాయి)

యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. ఇందులో భాగంగా కొడంగల్ మండలంలోని ధర్మాపూర్, గండ్లెపల్లి, టేకుల్‌కోడ్, ఇందనూర్ గ్రామాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేట్, అటవీ శాఖకు సంబంధించి మూడు వేల ఎకరాల్లో సున్నపు నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. ఖనిజ నిక్షేపాల ఆధారంగా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

### అభివృద్ధిపై సీఎం దృష్టి

కొడంగల్ ప్రాంతంలో విద్య, ఉద్యోగ, ఉపాధి తదితర వాటిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. పక్కా ప్రణాళికతో విద్యాసంస్థల ఏర్పాటు, పరిశ్రమలు, రైల్వేలైన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే వికారాబాద్-కృష్ణా రైల్వే లైన్ కోసం సర్వే పూర్తి కాగా పనులు ప్రారంభమయ్యే దశలో ఉన్నాయి. రాష్ట్రంలోనే మోడల్‌గా మెడికల్, ఇంజినీరింగ్, వెటర్నరీ, నర్సింగ్ కళాశాలలను మంజూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. దీంతో కొడంగల్ ప్రాంతం దశ, దిశ మారే అవకాశం ఉందని నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


### అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది



కొడంగల్ ప్రాంతం సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది. యువతకు ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఇప్పటికే ఈ ప్రాంతంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

- వెంకట్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి

### యువతకు ఉపాధి కల్పించాలి



సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ధర్మాపూర్ ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. పరిశ్రమ ఏర్పాటుతో ఈప్రాంత ప్రజలకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలి. పరిశ్రమ ఏర్పాటైతే ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.

- నారాయణరెడ్డి, ధర్మాపూర్

## మరమ్మతుకు నోచుకోని పంచాయతీ ట్రాక్టర్



ఖాజాఅహ్మద్‌పల్లిలో మూలన పడిన ట్రాక్టర్

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు ట్రాక్టర్లను మంజూరు చేయగా వాటి వినియోగం సరైన విధంగా కొనసాగడంలేదు.సర్పంచుల పదవీ కాలం ముగిసి సంవత్సరంపైగా అవుతుండడం, దీనికి తోడు పంచాయతీలకు నిధులు రాకపోవడంతో ట్రాక్టర్లు మరమ్మతులకు నోచుకోక మూలనపడ్డాయి. మండలంలోని ఖాజాఅహ్మద్‌పల్లిలో పంచాయతీ ట్రాక్టర్ చెడిపోయి సంవత్సరం అయినా మరమ్మతు చేయించేందుకు నిధులులేక మూలన పడేశారు. దీంతో పారిశుధ్య నిర్వాహణ అస్తవ్యస్తంగా మారిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు స్పందించి ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయించి అందుబాటులోకి వచ్చేలా చేయాలని కోరుతున్నారు.

## పీఎస్‌కు నూతన వాహనం



పూజా కార్యక్రమంలో పోలీసులు

దుద్యాల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దుద్యాల పోలీస్‌స్టేషన్‌కు నూతన వాహనం వచ్చింది. మండలంలోని పోలెపల్లి ఎల్లమ్మ దేవత ఆలయంలో ఆదివారం నూతన వాహనానికి పరిగి డీఎస్పీ శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, దుద్యాల ఎస్సై యాదగిరి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అధ్వానంగా రోడ్డు



మోమిన్‌పేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ నుంచి గోవిందాపూర్, మల్లారెడ్డిగూడ, రాంనాథ్‌గూడుపల్లి, కాస్లాబాద్ నుంచి కాస్లాబాద్ తండాకు, టేకులపల్లి నుంచి సుద్దొడ్డి తండా, మోమిన్‌పేట్ నుంచి మర్పల్లి, దుర్గం చెరువు, సైదాపూర్ తదితర గ్రామాల రోడ్లు అధ్వానంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీలు



పరిగిలో మసీదు వద్ద వేడుకల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగిలో ముస్లింల ర్యాలీ

పరిగి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మిలాద్-ఉన్-నబీ భారీ ర్యాలీ నిర్వహించారు. పరిగిలోని మసీదులో జరిగిన ప్రార్థనల్లో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ర్యాలీలో డీసీసీ కార్యదర్శులు కె.హన్మంత్, కొమిరె రాంచంద్రయ్య, అక్బర్ సేట్, బీఆర్‌ఎస్ నాయకులు కె.అనిల్‌రెడ్డి, బి.ప్రవీణ్ రెడ్డి,మౌలానా పాల్గొన్నారు.

**దోమ:** మొహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఆదివారం మండలంలో ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. బొంపల్లి గ్రామంలో మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో జామే మసీద్ నుంచి పురవీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మైనారిటీ నాయకులు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త ప్రపంచానికి శాంతి, సౌభ్రతృత్వాలు, సోదరభావాన్ని బోధించారన్నారు. ప్రవక్త మార్గంలో పయనిస్తూ మానవళి శ్రేయస్సు కోసం ప్రార్థించాలని పిలుపునిచ్చారు.

**ఘట్‌కేసర్ రూరల్:** మీలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు ప్రశాంత వాతావరణంలో ర్యాలీలు నిర్వహించాలని సీఐ బాలస్వామి తెలిపా రు. మీలాద్ ఉన్ నబీ సందర్భంగా ముస్లింలు ఉదయం ర్యాలీలు నిర్వహించారు. తమ పవిత్ర గ్రంథమైన ఖురాన్ చదివి వినిపించారు. ప్రశాంత వాతావరణంలో మిలాద్ ఉన్ నబీ పండుగను జరుపుకోవాలని సూచించారు. మసీద్‌ల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్‌సింగారం ఇందిరమ్మ కమిటీ సభ్యుడు బద్దం కుమార్, మాజీ ఉపసర్పంచ్‌లు ఆబేదా బేగం, మోహన్‌రెడ్డి, మేడిపల్లి ఎస్‌ఐ శివ కుమార్, నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ రూరల్: ప్రతాప్‌సింగారం డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద మిలాద్ ఉన్ నబీ ర్యాలీలో స్థానిక నాయకులు, పోలీసులు



దోమ: బొంపల్లిలో మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ముస్లింలు

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



హరీశ్ (ఫైల్)

దౌల్తాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతిచెందాడు. దౌల్తాబాద్ మండలంలోని రామన్‌కుంట తండాకు చెందిన నేనావత్ బల్‌రాం, విజ్జుబాయి దంపతుల కుమారుడు హరీశ్(20) వారణాసిలోని ఐఐటీ ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నాడు. శుక్రవారం వారణాసి పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు.

### బాలుడి అదృశ్యం



నాగచైతన్య

కులకచర్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యమైన ఘటన కులకచర్ల మండలంలోని రాంపూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై రమేశ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాంపూర్ గ్రామానికి చెందిన సువర్ణ కుమారుడు నాగచైతన్య(14) పరిగి తుంకలగడ్డ గురుకుల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. వినాయక చవితికి ఇంటికి వచ్చి ఈనెల 8వ తేదీన పరిగిలోని గురుకుల పాఠశాలకు వెళ్తానని చెప్పి వెళ్లాడు. కానీ పాఠశాలకు వెళ్లలేదు. విద్యార్థి ఆచూకీ కోసం వెతికినా లభించలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లి సువర్ణ ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. విద్యార్థి ఎవరికైనా కనిపిస్తే కులకచర్ల పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

### బొంరాస్‌పేట్‌లో వ్యక్తి..



నర్సిములు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన బొంరాస్‌పేట్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బాల వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి చెందిన పుట్టి నర్సిములు గత నెల 24న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆచూకి కోసం వెతికినా ఫలితం లేకపోయింది. ఆదివారం బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అనుచిత వ్యాఖ్యలు చేసిన యువకుడిపై ఫిర్యాదు

దోమ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివారెడ్డిపల్లి రాయికలి రమేశ్ యాదవ కులసంఘానికి చెందిన శ్రీకృష్ణ భగవాన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడని యాదవ సంఘం అధ్యక్షుడు నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం దోమ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దోమ గ్రామ అధ్యక్షుడు పెంటయ్య యాదవ్, మల్లేశ్ యాదవ్, అశోక్‌యాదవ్, ముద్దం మల్లేశ్ యాదవ్, భీమయ్య యాదవ్, నర్సిములుయాదవ్, భరత్‌యాదవ్, శ్రీకాంత్ యాదవ్, నరేశ్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, వేణుయాదవ్, దీపక్ యాదవ్ పాల్గొన్నారు.

## హిట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ చిన్నరెడ్డప్ప

పూడూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలం ఎన్కెపల్లి పరిధిలోని హిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.చిన్నరెడ్డప్ప ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ ప్రాస్పరిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉత్తవ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. ఇందులో భాగంగా తెలంగాణాలో ఉత్తమ సేవలందించినందుకు చిన్నరెడ్డప్పకు విజయవాడ సిద్ధార్థ కళాశాలలో ఎన్‌సీఈఆర్టీ సభ్యులు ప్రొఫెసర్ బి.రమేష్ బాబు, ఇందిరాగాంధీ ఓపెన్ యూనివర్సిటీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ అవార్డును ప్రదానం చేశారు.

## స్నేహితుడి కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతి చెందిన తోటి స్నేహితుడి కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు మెట్లకుంట గ్రామానికి చెందిన గురుదొడ్ల నర్సిములు, లక్ష్మి దంపతుల కుమారుడు గురుదొడ్ల కృష్ణ ఏసీ మెకానిక్‌గా హైదరాబాద్‌లో పనిచేస్తూ భార్య పూజ, కూతురు నిత్యశబ్రూత్‌తో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ఈనెల 10న హైదరాబాద్‌లోని దేవరయాంజిల్‌లో జయదర్శిని కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో పనులు చేస్తుండగా కృష్ణ విద్యుదాఘాతంతో భవనంపై నుంచి పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 2007-2008 పదో తరగతి బ్యాచ్ బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్నేహితులు కృష్ణ కుటుంబాన్ని ఆదివారం పరామర్శించి రూ.60వేలు ఆర్థిక సాయం అందజేశారు.

## కళాశాలల బంద్‌కు మద్దతు

పరిగి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వృత్తి విద్య కళాశాలల బంద్‌కు ఎస్ఎఫ్ఐ మద్దతు ఇస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చాకలి అనిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మా, నర్సింగ్, ఎంబీఏ, ఎంసీఏ వృత్తి విద్య కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు రూ.10వేల కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. ఫీజురీయింబర్స్‌మెంట్ డబ్బులు ఇవ్వకపోతే కళాశాలలు ఎలా నడుస్తున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వ విధానాల వల్ల విద్యావ్యవస్థ పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. కళాశాలల బంద్ సమర్థనీయమేనన్నారు.

## 17న స్వర్ణామృత ప్రాశన

తాండూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీన ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాశన నిర్వహిస్తున్నట్లు తాండూరు నగర సేవ ప్రముఖ్ మైలారం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆదర్శనగర్ వరసిద్ధి వినాయక ఆలయంలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పిల్లలు తరచూ అనారోగ్యానికి గురైతే ధన్వంతరీ ఆయుర్వేద చికిత్స ఆలయం పంచకర్మ కేంద్రం ద్వారా చికిత్స అందిస్తామని తెలిపారు.